సాక్షి విశాఖపట్నం

ఆదివారం । 23 । జూన్ । 2024



ఏరువాక పున్నమి పూజలు

సింహాచలం దేవస్థానానికి చెందిన శ్రీకృష్ణాపురంలోని గోశాలలో శనివారం ఏరువాక పున్నమి పూజలు నిర్వహించారు. 8లో



అక్షయపాత్రకు వ్యాన్ అందజేత

జగ్గరాజుపేట సమీపంలోని భారత్ డైనమిక్స్ లిమిటెడ్ సంస్థ అక్షయపాత్ర ఫౌండేషన్‌కు ఉచితంగా వ్యాన్‌ను అందజేసింది. 8లో



సందడిగా ఫిషింగ్ హార్బర్

తూర్పు తీరంలో మత్స్యవేట ఆశాజనకంగా సాగుతోంది. మత్స్యకారులకు పుష్కలంగా చేపలు లభిస్తున్నాయి. 8లో

న్యూస్‌రీల్

శాస్త్రోక్తంగా అప్పన్నకు చందన సమర్పణ



చందనంతో అప్పన్న ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి

సింహాచలం: జ్యేష్ట పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి మూడవ విడత చందనం సమర్పణ శాస్త్రోక్తంగా జరిగింది. తెల్లవారుజామున స్వామిని మేళ తాళాలు, వేదమంత్రోచ్చరణలతో మేల్కొలిపారు. సుప్రభాత సేవ నిర్వహించారు. అనంతరం ఆలయ భాండాగారంలో భద్రపరిచిన మూడు మణుగుల (120కిలోల) పచ్చి చందనాన్ని అర్చకులు తీసుకొచ్చి స్వామి మూలవిరాట్‌కి సమర్పించారు.

విశేషంగా పంచకలశ స్నపనం

జ్యేష్ట పౌర్ణమి సందర్భంగా స్వామికి ఉదయం పంచకలశ స్నపనాన్ని నిర్వహించారు. ఆలయ ఆస్థాన మండపంలో స్వామి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. గంగధార జలాలు, పంచామృతాభిషేకాలతో అభిషేకాన్ని నిర్వహించారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామికి చందన సమర్పణ చేసి.. విశేషంగా హారతులిచ్చారు.

పీవీ అభినందన సభ నేడు

సీతంపేట: భారతరత్న, మాజీ ప్రధాన మంత్రి పి.వి.నరసింహారావు 104వ జయంతి సందర్భంగా ఈ నెల 23వ తేదీ సాయంత్రం 6 గంటలకు జిల్లా పరిషత్ జంక్షన్ అంకోసా హాల్‌లో అభినందన సభ నిర్వహించనున్నట్లు విశాఖ రసజ్ఞ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు గండికోట రఘురామారావు తెలిపారు. పి.వి.గ్లోబల్ ఫౌండేషన్ అధ్యక్షుడు పి.వి.ప్రభాకరరావు ముఖ్య అతిథిగా పాల్గొంటారని, సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్ డైరెక్టర్ ఆచార్య ఎ.ప్రసన్నకుమార్, ప్రముఖ పాత్రికేయుడు ఎ.కృష్ణారావు పాల్గొంటారని తెలిపారు. పీవీ తెచ్చిన సంస్కరణలు నేటి సమాజానికి ఎలా ఉపయోగపడుతున్నాయో అతిథులు వివరిస్తారని పేర్కొన్నారు.

రేపు వినతుల స్వీకరణ

మహారాణిపేట: కలెక్టర్ కార్యాలయంలో ప్రతీ సోమవారం వినతులు స్వీకరిస్తున్నట్లు కలెక్టరేట్ వర్గాలు ఓ ప్రకటనలో తెలిపాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 24 నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక పేరిట ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నాయి. కలెక్టర్, జిల్లా అధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరించి.. పరిష్కారం కోసం తగిన చర్యలు తీసుకోనున్నారు.

రేపటి నుంచి ఐటీఐల్లో మిగుల సీట్ల భర్తీ

కంచరపాలెం: జిల్లాలోని మూడు ప్రభుత్వ, 29 ప్రైవేట్ ఐటీఐల్లో వివిధ ట్రేడ్‌ల్లో ప్రవేశాలకు కంచరపాలెం ప్రభుత్వ పాత ఐటీఐలో కౌన్సెలింగ్ కొనసాగుతోంది. మిగులు సీట్లను ఈ నెల 24 నుంచి భర్తీ చేస్తామని ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి, సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి చేసుకుని.. కౌన్సెలింగ్ సమాచారం రాని అభ్యర్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, వెరిఫికేషన్ ఫారంతో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు.

తేదీలు	ర్యాంకు నంబర్లు
24వ తేదీ	బాలికలు, స్టీల్‌ప్లాంట్, పీహెచ్, ఎక్స్ సర్వీస్ అభ్యర్థులు ఈడబ్ల్యూఎస్ 1 నుంచి 3,398 ర్యాంక్ వరకు జనరల్ కేటగిరీ 1 నుంచి 892 ర్యాంక్ వరకు
25	893 నుంచి 2309 ర్యాంక్ వరకు
26	2310 నుంచి 3398 ర్యాంక్ వరకు

ఫీజులుం!



- ప్రైవేట్ స్కూళ్లలో గతేడాది కంటే భారీగా ఫీజుల పెంపు
- సామాన్య, మధ్య తరగతిపై మోయలేని భారం
- చోద్యం చూస్తున్న విద్యాశాఖ అధికారులు
- జిల్లాలో ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలో 781 స్కూళ్లు
- 2.96 లక్షల మంది ప్రైవేట్ స్కూళ్లలోనే చదువులు

నగరంలోని ఎంవీపీకాలనీకి చెందిన చిరు వ్యాపారి వెంకటరమణ తన పిల్లలిద్దరినీ లాసన్స్‌బేలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో చదివిస్తున్నాడు. ఈ ఏడాది ఆరో తరగతి చదువుతున్న కుమార్తెకు రూ.16 వేలు, 7వ తరగతి చదువుతున్న కుమారుడి ఫీజు రూ.9 వేలు గతేడాది కంటే అదనంగా పెంచినట్లు పాఠశాల యాజమాన్యం తెలుపడంతో తలపట్టుకుంటున్నాడు. కుటుంబం గడవడమే కష్టమైన తరుణంలో పిల్లల చదువులెలా అని వెంకటరమణకు దిగులు మొదలైంది.

విశాఖ విద్య: జిల్లాలోని కొన్ని ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాల విద్యా వ్యాపారానికి అంతులేకుండా పోతుంది. అడిగేవారు లేరనే ధీమాతో అడ్డగోలుగా ఫీజులు దోపిడీకి తెరలేపారు. నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలల్లోనే పుస్తకాలు, నోట్స్ విక్రయిస్తుండంతో పాటు ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 'ఫీజు రెగ్యులేటరీ కమిషన్' పర్యవేక్షణ ఉండటంతో గతేడాది వరకు తగ్గిన ప్రైవేట్ యాజమాన్యాలు.. ప్రస్తుతం భారీగా ఫీజులు పెంచేశారు. తమ పిల్లలను ప్రైవేట్ స్కూళ్లలో చదివించుకోవాలనే తపన పడుతున్న పేద, మధ్య తరగతి వారికి ఫీజులు పెంపు మోయలేని భారమవుతోంది.

విశాఖలో ప్రైవేట్ ఆధిపత్యమే..

జిల్లాలో 1,389 పాఠశాలలు ఉండగా.. వీటిలో 781 ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలో నిర్వహిస్తున్నారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు జిల్లాలో 3,91,736 మంది విద్యార్థులు(2023–24 విద్యా సంవత్సరం లెక్క ప్రకారం) చదువుతుండగా.. వీరిలో 2,96,903 మంది ప్రైవేటు స్కూళ్లకే వెళ్తున్నారు. ఈ లెక్కన విశాఖ జిల్లాలో ప్రైవేట్ స్కూళ్ల ఆధిపత్యమే కొనసాగుతుందనేది తేటతెల్లం. ఉత్తరాంధ్ర జిల్లాలకు కేంద్ర బిందువుగా ఉన్న విశాఖ నగరానికి వ్యాపార, ఉద్యోగ, చదువుల పరంగా వచ్చే వారి సంఖ్య ఏటా పెరుగుతుంది. ఇలాంటి వారిలో ఎక్కువ మంది ప్రైవేట్ స్కూళ్లలోనే చేరేందుకు ఆసక్తి చూపుతుండటంతో వాటికి డిమాండ్ బాగా ఉంది. ఈ నేపథ్యంలో ఏడాదికేడాదికి నగరంలో కొత్త కొత్త విద్యా సంస్థలు వెలుస్తున్నాయి.

గుర్తింపు లేకున్నా.. స్కూళ్ల నిర్వహణ

జిల్లాలో పలు స్కూళ్లకు ప్రభుత్వ పరంగా గుర్తింపు లేకున్నా, దర్జాగానే నిర్వహిస్తుండటం గమనార్హం. డీఈవో ఎల్. చంద్రకళ గత నెలలో ఎంఈవోలు, సీఆర్పీలు, ఇతర విద్యాశాఖాధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ప్రైవేట్ స్కూళ్లకు రెన్యువల్, గుర్తింపు విషయంలో కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. కానీ క్షేత్ర స్థాయిలో మరోలా జరుగుతోంది. మహారాణిపేట మండలంలో 30, సీతమ్మధారలో 18, చినగదిలిలో 3 స్కూళ్లకు షోకాజ్ నోటీసులు ఇచ్చినా.. తదుపరి చర్యలు లేవు. జిల్లాలోని మిగతా మండలాల్లోని ప్రైవేట్ స్కూళ్లపై తనిఖీలు కూడా సవ్యంగా జరుగలేనట్లు తెలుస్తోంది.

ఫీజులు పెంపునకు అడ్డుకట్ట ఏదీ?

ప్రైవేట్ స్కూళ్లలో ఏఏ తరగతులకు ఎంత ఫీజులు వసూలు చేయాలనేది ప్రభుత్వం నిర్ణయిస్తుంది. కానీ రాష్ట్రంలో కూటమి నేతృత్వంలోని ప్రభుత్వం ఏర్పాటు కావడం, ఇదే సమయంలో విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల ఖరారుపై పాలకులు దృష్టి పెట్టలేదు. ఇదే అదునుగా భావించిన కొన్ని ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు ప్రతీ తరగతికి గతేడాది వసూలు చేసిన దానికంటే ఫీజులు భారీగా పెంచేశారు. కొంతమంది విద్యార్థుల తల్లిదండ్రులు దీనిపై విద్యాశాఖాధికారుల దృష్టికి తీసుకొస్తే.. అనధికారికంగా ఎంతో కొంత తగ్గించేలా యాజమాన్యాలకు సిఫారసు చేస్తున్నారు. కానీ చాలా మంది తమ సమస్యను ఎవరికి చెప్పుకోవాలో తెలియక, పిల్లల చదువులకు ఆటంకం కాకూడదని అప్పో, సప్పో చేసి ఫీజులు చెల్లిస్తున్నారు.

విశాఖ ప్రగతిపై మల్లికార్జున ముద్ర

కేజీహెచ్ అభివృద్ధికి బాటలు వేసిన కలెక్టర్



తాటిచెట్లపాలెం: జిల్లా కలెక్టర్ మల్లికార్జునకు బదిలీ అయింది. జీఏడీకి రిపోర్టు చేయాల్సిందిగా ఆయన్ని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్‌కు అదనపు బాధ్యతలను అప్పగించింది. 2012 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఎ.మల్లికార్జున 2021 జూన్‌లో విశాఖ ఉమ్మడి జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. విద్య, వైద్యంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చారు. వివిధ పరిశ్రమల ద్వారా సీఎస్సార్ నిధులు సమీకరించి జిల్లాలోని ప్రభుత్వ వసతి గృహాలను ఆధునికీకరించారు. రూ.వందల కోట్లతో కేజీహెచ్‌లో పూర్తి సౌకర్యాలు కల్పించడంలో డాక్టర్ మల్లికార్జున ముఖ్య భూమిక పోషించారు. కార్డియాలజీ, పీడియాట్రిక్ వార్డు, రోగుల సహాయకుల కోసం షెల్టర్లు, అధునాతన వైద్య పరికరాల ఏర్పాటు, అత్యాధునిక సదుపాయాలతో రెండో క్యాజువాల్టీని ప్రారంభించారు. విక్టోరియా ఆస్పత్రిని అభివృద్ధి చేశారు. ఏ చిన్నపాటి జ్వరం వచ్చినా మైదాన ప్రాంతాలకు పరుగులు తీసే ఏజెన్సీ ప్రజలకు వైద్య సౌకర్యాలను డాక్టర్ మల్లికార్జున చేరువ చేశారు. ఏజెన్సీలోని ప్రభుత్వ వైద్యశాలల్లో శస్త్ర చికిత్సలు చేసే స్థాయికి తీసుకొచ్చిన ఘనత ఆయనదే. రక్తహీనతతో బాధపడుతున్న రోగులకు ప్రత్యేకంగా సేవలందించే ఏర్పాట్లు చేశారు. రెండేళ్ల కిందట కలెక్టర్ ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసి విరాళాలు సేకరించే కార్యక్రమాన్ని రాష్ట్రంలోనే తొలిసారిగా ప్రారంభించారు. ఈ నిధి ద్వారా సేకరించిన డబ్బులతో ఎయిడ్స్ బారిన పడిన కుటుంబాల చిన్నారులు, ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు హెల్త్ ఇన్సూరెన్స్‌లు చేశారు. అలాగే నిధులతో పేదల అవసరాలను తీర్చిన డా.మల్లికార్జున సేవా కార్యక్రమాలతో పాటు పరిపాలనలోనూ సంస్కరణలు తీసుకొచ్చారు. జిల్లాలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టుల కోసం మల్లికార్జున ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి.. విలువైన ఆరోగ్య పరీక్షలను ఉచితంగా చేయించారు. సీఎస్సార్ నిధులతో హెల్త్ స్కీం ప్రీమియం కూడా చెల్లించే ఏర్పాట్లు చేశారు. ఇటీవల జరిగిన ఎన్నికలను సైతం అన్ని శాఖల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించారు.

ఎండల్లోనూ 'హర్ష'పాతం!

- సాధారణంకంటే 40.6 శాతం అధికం
- విశాఖ జిల్లాలో 'నైరుతి' సీజను ఆశాజనకం
- అత్యధికంగా గాజువాకలో 145.7 మి.మీల నమోదు
- జులైలో వర్షాలు సమృద్ధిగా కురిసే అవకాశం



నగరంలో కురుస్తున్న వర్షం (ఫైల్)

సాక్షి, విశాఖపట్నం: వేసవి కాలం పోయి వానా కాలం వచ్చినా ఉష్ణతాపం తగ్గలేదు. ఉక్కపోత కూడా తగ్గలేదు. వడగాడ్పులు లేకపోయినా ఎండలు కాస్తూనే ఉన్నాయి. అప్పుడప్పుడు వర్షాలూ కురుస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో విశాఖ జిల్లాలో వానలు కురుస్తున్నా ఉష్ణోగ్రతలు 37–40 డిగ్రీల మధ్య నమోదవుతున్నాయి. అయినప్పటికీ వర్షపాతం మాత్రం ఆశాజనకంగానే ఉంది. జూన్ ఒకటో తేదీ నుంచి నైరుతి రుతుపవనాల సీజను ఆరంభమైంది. అప్పట్నుంచి ఇప్పటివరకు జిల్లాలో 86.2 మి.మీల వర్షపాతానికి గాను 121.2 మి.మీలు కురిసింది. అంటే సాధారణంకంటే 40.6 శాతం అధిక వర్షపాతం రికార్డయింది. విశాఖపట్నం జిల్లా పరిధిలో 11 మండలాలున్నాయి. వీటిలోకెల్లా గాజువాకలో అత్యధికంగా 145.7 శాతం వర్షపాతం నమోదైంది. అక్కడ 49.4 మి.మీలు కురవాల్సి ఉండగా 121.4 మి.మీలు కురిసింది. అత్యల్పంగా సీతమ్మధారలో 84.0 మి.మీలకు 95.1 మి.మీల వర్షపాతం రికార్డయింది. ఇది సాధారణంకంటే 13.2 శాతం అధికమన్నమాట! ఇలా జిల్లాలోని పదకొండు మండలాల్లోనూ సాధారణానికి మించి వర్షపాతం నమోదైంది. విరామం లేకుండా ఎండలు కాస్తున్నా ఒక్క మండలంలో కూడా లోటు వర్షపాతం నమోదు కాలేదు.

ఆకస్మిక వర్షాలతోనే..

విశాఖ జిల్లాలో ఉష్ణతాపం ప్రభావం చూపుతున్నా ఆకస్మిక వర్షాల వల్ల సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం రికార్డవుతోంది. ఎండలు, ఉక్కపోత వాతావరణంతో ఇబ్బంది పడుతున్న వేళ ఉన్నట్టుండి వర్షాలు కురిసి పోతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో గంటలోపు కుండపోతగా కురుస్తుండడంతో అక్కడ అధిక వర్షపాతం నమోదవుతోంది. దీంతో మిగిలిన ప్రాంతాల్లో అంతగా కురవకపోయినా మండల/జిల్లా సగటు వర్షపాతంలో చేరుతోంది. ఇలా కొన్ని చోట్ల వర్షాభావ పరిస్థితులున్నా సగటు వర్షపాతం అధికంగానే కనిపిస్తోంది.

జులైలో పుష్కలంగా..

మరోవైపు జులై నెలలో వర్షాలు మరింత పుష్కలంగా కురిసే అవకాశం ఉందని ఇప్పటికే భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ఇప్పటికే వెల్లడించింది. దీంతో జూన్‌కంటే జులైలో సమృద్ధిగా వానలు కురవనున్నాయి. ఇవి ఖరీఫ్ సాగుకు ఎంతగానో దోహదపడనున్నాయి. కొద్ది రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో రైతులు తొలకరి వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.

ఏ మండలంలో ఎంత వర్షపాతం? (మి.మీలలో)

మండలం	కురిసినది	కురవాల్సింది	వ్యత్యాసం	స్థితి
పెందుర్తి	99.9	83.2	20.1 శాతం	అధికం
ఆనందపురం	140.7	97.0	45.1 శాతం	అధికం
పద్మనాభం	161.7	118.9	36.0 శాతం	అధికం
భీమునిపట్నం	125.8	102.3	23.0 శాతం	అధికం
విశాఖ రూరల్	104.5	72.6	43.9 శాతం	అధికం
సీతమ్మధార	95.1	84.0	13.2 శాతం	సాధారణం
పెదగంట్యాడ	119.9	78.7	52.4 శాతం	అధికం
గాజువాక	121.4	49.4	145.7 శాతం	అత్యధికం
మహారాణిపేట	122. 6	84.0	46.0 శాతం	అధికం
గోపాలపట్నం	129.8	83.2	56.0 శాతం	అధికం
ములగాడ	109.3	78.7	38.9 శాతం	అధికం

విశాఖ సహకార బ్యాంక్ లక్ష్యం రూ.8 వేల కోట్లు

బ్యాంక్ ఛైర్మన్ రాఘవేంద్రరావు



మాట్లాడుతున్న బ్యాంక్ ఛైర్మన్ రాఘవేంద్రరావు

సీతమ్మధార: విశాఖ సహకార బ్యాంక్ 2024–25 ఆర్థిక సంవత్సరంలో వ్యాపార లక్ష్యం రూ.8వేల కోట్లుగా నిర్ణయించినట్లు ఆ బ్యాంక్ ఛైర్మన్ చలసాని రాఘవేంద్రరావు వెల్లడించారు. ద్వారకానగర్‌లోని బ్యాంక్ కేంద్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఆర్థిక సంవత్సరం (2023–24)లో రూ.7,300 కోట్ల మైలురాయిని అధిగమించామన్నారు. బ్యాంక్ ప్రస్తుతం 1,04,865 మంది సభ్యులు, రూ.352.61 కోట్ల షేర్ ధనంతో దేశంలోనే అతి పెద్ద పట్టణ సహకార బ్యాంకుల్లో ఒకటిగా స్థానం సంపాదించుకుందన్నారు. సభ్యులకు రూ.లక్ష వరకు ఉచిత బీమా సదుపాయం ఉందని, రుణాలు సక్రమంగా చెల్లించిన వారికి నాలుగు శాతం రాయితీ ఇస్తున్నామన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో 2,596 మందికి రూ.5.51 కోట్ల మేరకు సంక్షేమ పథకాలు అమలు చేసినట్లు వివరించారు. 108వ వార్షిక మహాజన సభ నిర్ణయం మేరకు రూ.33.56 కోట్లను సభ్యులకు షేరు ధనం మీద డివిడెండ్‌గా చెల్లించామన్నారు. ఐదు కొత్త శాఖలో ఏర్పాటులో భాగంగా ఈ నెల 20న శీలానగర్‌లో 51వ శాఖను ప్రారంభించామని గుర్తు చేశారు. త్వరలోనే చిత్తూరు, బాపట్ల, నరసరావుపేట ప్రాంతాల్లో కొత్త శాఖలు ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటికే 14 శాఖలకు సొంత భవనాలు ఉన్నాయని, గాజువాక, గోపాలపట్నం శాఖలకు స్థలాలు, చోడవరం శాఖ సొంత భవనం కొనుగోలు చేశామన్నారు. బ్యాంక్‌లో డైలీ డిపాజిట్ పథకం అమల్లో ఉందన్నారు.

ఏడాది కాలవ్యవధిలో కోటికి పైగా డిజిటల్ లావాదేవీల ద్వారా రూ.5714 కోట్ల టర్నోవర్ జరిగిందని, గతేడాది రూ.87.79కోట్ల నికర లాభం సంపాదించామన్నారు. డిపాజిట్ల కింద రూ.4148 కోట్లు, రుణాల కింద రూ.3,199 కోట్లు మంజూరు చేశామన్నారు. బ్యాంకు సీఈవో పి.వి.నరసింహమూర్తి, డైరెక్టర్లు మానం ఆంజనేయులు, జేవీ సత్యనారాయణమూర్తి, స్టాలిన్, ఉప్పలపాటి పార్వతీదేవి, కామరాజు, చంద్రశేఖర్, జనార్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

నీట్ నిర్వహణపై సమగ్ర విచారణ

పీడీఎస్‌వో డిమాండ్



ధర్నాలో పాల్గొన్న పీడీఎస్‌వో విద్యార్థులు

సీతమ్మధార: నీట్–2024 నిర్వహణపై సమగ్ర విచారణ జరిపించాలని ప్రగతి శీల విద్యార్థి సంస్థ(పీడీఎస్‌వో) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.సురేష్ డిమాండ్ చేశారు. ఆశీలమెట్ట గాంధీ విగ్రహం ఆవరణలో శనివారం జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడారు. నీట్–2024పై దేశంలోని కోట్ల మంది ప్రజల ప్రాణాలు, లక్షల మంది విద్యార్థుల జీవితాలు ఆధారపడి ఉన్నాయన్నారు. నీట్ నిర్వహణలో జరిగిన అవకతవకలు, పేపర్ లీకేజీపై రోజుకొక విషయం బయటకు వస్తోందని.. ప్రశ్నాపత్రం ఒక్కరోజు ముందే సోషల్ మీడియాలో హల్‌చల్ చేసిందన్నారు. దేశంలో 67 మంది విద్యార్థులకు 720/720 మార్కులు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. వీరిలో ఆరుగురు విద్యార్థులు ఒకే కేంద్రానికి చెందినవారని గుర్తు చేశారు. బిహార్, గుజరాత్‌లో జరిగిన పేపర్ లీకేజీ ఘటనలపై కేంద్రం తక్షణమే స్పందించాలన్నారు. నీట్‌పై దేశ వ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నా.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. వైద్య విద్య ప్రవేశ పరీక్షల నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. పీడీఎస్‌వో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.విశ్వనాథ్, వి.లక్ష్మి, రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎస్.రుద్రి, నీట్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్య శాఖ సంఘ కార్యవర్గంలో విశాఖకు ప్రాధాన్యం

మహారాణిపేట: వైద్య ఆరోగ్య ఉద్యోగుల సంఘం (తెలుగు నాడు మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్) రాష్ట్ర కమిటీ ఎన్నికల్లో విశాఖ జిల్లాకు చెందిన పలువురు ఉద్యోగులు రాష్ట్ర కార్యవర్గంలో కీలక పదవుల్లో ఎన్నికయ్యారు. సంఘం ప్రధాన కార్యదర్శిగా బి.శ్రీనివాసాచార్యులు, కోశాధికారిగా బండారు శ్రీనివాసరావు, చీఫ్ వైస్ ప్రెసిడెంట్‌గా వెంకట లక్ష్మి, ఉపాధ్యక్షుడిగా పి.శేషుబాబులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ కొత్త కార్యవర్గం రెండేళ్ల పాటు అధికారంలో ఉంటుందన్నారు. హక్కుల సాధన కోసం పూర్తిస్థాయిలో కృషి చేస్తామన్నారు.

'సుభాష్ చంద్రబోస్' పురస్కారాలకు దరఖాస్తులు

మహారాణిపేట: సుభాష్ చంద్రబోస్ ఆపద ప్రబంధన్ పురస్కారాల కోసం విపత్తుల నిర్వహణలో కృషి చేసిన సంస్థలు, వ్యక్తుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టరేట్ కార్యాలయం వర్గాలు ఓ ప్రకటనలో తెలిపాయి. సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా జనవరి 23న సంస్థకు రూ.51 లక్షలు, వ్యక్తి రూ.5లక్షలు చొప్పున నగదు పురస్కారాలను అందజేస్తారని పేర్కొన్నాయి. 2024 జూలై 01 నుంచి 2024 ఆగస్టు 31 వరకు https://awards.gov.in లో దరఖాస్తు చేసుకోవచ్చు. జూలై ఒకటో తేదీ నుంచి ఈ సైట్ ఓపెన్ అవుతుంది. ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చు.

గంజాయి తరలిస్తున్న నలుగురి అరెస్టు

అల్లిపురం: గంజాయి తరలిస్తున్న నలుగుర్ని సిటీ టాస్క్ ఫోర్సు పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 63 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. టూటౌన్ సీఐ బి.తిరుమలరావు తెలిపిన వివరాల ప్రకారం అల్లిపురం, సౌత్‌జైలురోడ్డులో అనుమానాస్పదంగా తిరుగుతున్న వీరిని తనిఖీ చేయగా 63 కేజీల గంజాయి పట్టుబడింది. ఈ నలుగురు అల్లూరి జిల్లాకు చెందిన వారిగా గుర్తించారు. నిందితులను టూటౌన్ పోలీసులకు అప్పగించారు.

భీమిలిలో టీడీపీ అరాచకం



అద్దాలు పగిలిన కార్పొరేటర్ ఇల్లు ఇదే..

కొమ్మాది: ప్రశాంతమైన భీమిలిలో టీడీపీ నాయకులు అరాచకాలు సృష్టిస్తున్నారు. శుక్రవారం అర్ధరాత్రి 4వ వార్డు కార్పొరేటర్ దొలపల్లి కొండబాబు ఇంటిపై రాళ్లతో దాడి చేశారు. శనివారం సాయంత్రం వైజాగ్ ఫిల్మ్‌నగర్ క్లబ్ సెంటర్‌లో గతంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ లాన్స్ పేరును ధ్వంసం చేశారు. టీడీపీ నాయకులు, నేతలు చేస్తున్న అరాచకాలపై స్థానిక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. విశాఖలో ఎన్నడూ లేని విధంగా విష సంస్కృతిని తీసుకొస్తున్నారని ఆరోపించారు. ప్రశాంతతకు మారు పేరైన ఈ ప్రాంతంలో టీడీపీ నేతలు విధ్వంసం సృష్టించడం వారి పతనానికి నాంది కాబోతుందని పలువురు సీనియర్ సిటిజన్లు శాపనార్థాలు పెట్టారు. వైఎస్సార్ పేరును తొలగించడంపై వైఎస్సార్ సీపీ స్థానిక నాయకులు, మహానేత రాజశేఖరరెడ్డి అభిమానులు తీవ్రంగా ఖండించారు.

పలు రైళ్ల రద్దు.. రీషెడ్యూల్

తాటిచెట్లపాలెం: దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ పరిధిలో జరుగుతున్న ఆధునికీకరణ పనుల నిమిత్తం విశాఖ నుంచి, విశాఖ మీదుగా ఆ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లు ఆయా తేదీల్లో రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు. ఈ రైళ్లు కాకుండా మిగిలిన రైళ్లు యథావిధిగా నడవనున్నాయి.

ఈనెల 23 నుంచి ఆగస్టు 9వ తేదీ వరకు రద్దయిన రైళ్లు

- తిరుపతి–విశాఖపట్నం(22708) డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్

ఈనెల 23 నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు రద్దయిన రైళ్లు

- రాజమండ్రి–విశాఖపట్నం(07466) మెము పాసింజర్, విశాఖపట్నం–రాజమండ్రి(07467) మెము పాసింజర్, మచిలీపట్నం–విశాఖపట్నం (17219) ఎక్స్‌ప్రెస్, గుంటూరు–విశాఖపట్నం (17239) సింహాద్రి ఎక్స్‌ప్రెస్, గుంటూరు – రాయగడ (17243) ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం–లింగంపల్లి(12805) జన్మభూమి ఎక్స్‌ప్రెస్

ఈనెల 24 నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు రద్దయిన రైళ్లు

విజయవాడ–విశాఖపట్నం(12718) రత్నాచల్ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం–విజయవాడ(12717) రత్నాచల్ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం–గుంటూరు (22701) ఉదయ్ డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్, గుంటూరు–విశాఖపట్నం (22702) ఉదయ్ డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్ (రైలు నడిచే రోజులలో), విశాఖపట్నం–తిరుపతి (22707) డబుబ్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్.

ఈనెల 24 నుంచి ఆగస్టు 11వ తేదీ వరకు రద్దయిన రైళ్లు

విశాఖపట్నం– మచిలీపట్నం (17220) ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం–గుంటూరు (17240) సింహాద్రి ఎక్స్‌ప్రెస్, రాయగడ–గుంటూరు (17244) ఎక్స్‌ప్రెస్, లింగంపల్లి–విశాఖపట్నం(12806)జన్మభూమి ఎక్స్‌ప్రెస్.

వాల్తేర్ డివిజన్ పరిధిలో..

ఈనెల 24వ తేదీన రద్దయిన రైళ్లు

పలాస–విశాఖపట్నం(07471) పాసింజర్ స్పెషల్, విశాఖపట్నం–పలాస(07470) పాసింజర్ స్పెషల్, విశాఖపట్నం–గుణుపూర్(08522) పాసింజర్ స్పెషల్, గుణుపూర్–విశాఖపట్నం(08521) పాసింజర్‌స్పెషల్, విశాఖపట్నం–బ్రహ్మపూర్(18526) ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం–భువనేశ్వర్(22820) ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం–భవానిపట్న (08504) పాసింజర్ స్పెషల్

ఈనెల 25న రద్దయిన రైళ్లు

బ్రహ్మపూర్–విశాఖపట్నం(18525) ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్–విశాఖపట్నం(22819) ఎక్స్‌ప్రెస్, భవానిపట్నం–విశాఖపట్నం (08503) పాసింజర్ స్పెషల్

పలు రైళ్లు రీ షెడ్యూల్

- ఈ నెల 24న మధ్యాహ్నం 12 గంటలకు బయల్దేరే పూరీ–గుణుపూర్(184417) ఎక్స్‌ప్రెస్ గంట ఆలస్యంగా మధ్యాహ్నం 1గంటకు బయల్దేరుతుంది.
- ఈనెల 23వ తేదీన మధ్యాహ్నం 2గంటలకు బయల్దేరాల్సిన ఛత్రపతి శివాజి ముంబయి టెర్మినస్– భువనేశ్వర్ (11019) కోణార్క్ ఎక్స్‌ప్రెస్ 3గంటలు ఆలస్యంగా సాయంత్రం 5గంటలకు బయల్దేరుతుంది.
- ఈ నెల 24వ తేదీన ఉదయం 5.20 గంటలకు బయల్దేరాల్సిన రాయ్‌పూర్–విశాఖపట్నం 2 గంటలు ఆలస్యంగా ఉదయం 7.20 గంటలకు బయల్దేరుతుంది.
- ఈ నెల 24న ఉదయం 8.20 గంటలకు బయల్దేరాల్సిన కోరాపుట్ –విశాఖపట్నం (08545) పాసింజర్ 3 గంటలు ఆలస్యంగా ఉదయం 11.20 గంటలకు బయల్దేరుతుంది.
- ఈ నెల 24వ తేదీన సాయంత్రం 5.45 గంటలకు బయల్దేరాల్సిన విశాఖపట్నం–బ్రహ్మపూర్(08532) పాసింజర్ గంట ఆలస్యంగా 6.45 గంటలకు బయల్దేరుతుంది.
- ఈ నెల 24వ తేదీన ఉదయం 10.50 గంటలకు బయల్దేరాల్సిన సంబల్‌పూర్–నాందేడ్(208090 ఎక్స్‌ప్రెస్ గంట ఆలస్యంగా 11.50 గంటలకు బయల్దేరుతుంది.
- ఈ నెల 24వ తేదీన తెల్లవారు 4.30గంటలకు బయల్దేరాల్సిన సికింద్రాబాద్–షాలిమర్(07225) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ 3 గంటలు ఆలస్యంగా ఉదయం 7.30 గంటలకు బయల్దేరుతుంది.

యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రెగ్యులేట్

విజయవాడ డివిజన్ పరిధిలో జరుగుతున్న భద్రతా పనుల నిమిత్తం ఈ నెల 30, జూలై 7,14,21,28, ఆగస్టు 4వ తేదీన యశ్వంత్‌పూర్‌లో బయల్దేరే యశ్వంత్‌పూర్–టాటా (18112) ఎక్స్‌ప్రెస్‌ను విజయవాడ డివిజన్ పరిధిలో గంట సేపు ఆయా స్టేషన్లలో నిలిపివేయనున్నారు.

సందడిగా ఫిషింగ్ హార్బర్


హార్బర్‌లో బిజీ బిజీగా మత్స్యకారులు

మహారాణిపేట: విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో సందడి నెలకొంది. ఈ నెల 14వ తేదీ అర్ధరాత్రి నుంచి వేట ప్రారంభం కాగా.. ఆ రోజు దాదాపు 50 శాతం బోట్లు వేటకు వెళ్లాయి. తర్వాత మిగిలిన బోట్లు వేటకు వెళ్లగా.. మత్స్యవేట ఆశాజనకంగా సాగుతోంది. మత్స్యకారుల వలలకు పుష్కలంగా చేపలు చిక్కుతున్నాయి. వేటకు వెళ్లిన బోట్లు తిరిగి వస్తుండటంతో ఫిషింగ్ హార్బర్‌లో సందడి వాతావరణం నెలకొంది.

దొంగల ముఠా హల్‌చల్

- మూడు అపార్ట్‌మెంట్లలో చొరబడిన దొంగలు
- ఓ ఫ్లాట్‌లో 7 తులాల బంగారు ఆభరణాల చోరీ
- పీఎంపాలెంలో ఘటన




అపార్టుమెంట్‌లోని సీసీ కెమెరాల్లో నమోదైన దొంగల కదలికలు

పీఎంపాలెం: పీఎంపాలెం, మధురవాడ ప్రాంతాల్లో దొంగల ముఠా హల్‌చల్ చేసింది. కారుషెడ్ కూడలికి సమీపంలో గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత మూడు అపార్ట్‌మెంట్లలోకి దొంగలు చొరబడ్డారు. శ్రీ తామరాంధ్ర నిలయం అపార్ట్‌మెంట్‌లోని 403, 502 ఫ్లాట్లలో చోరీ జరిగినట్లు పోలీసులు గుర్తించారు. పీఎంపాలెం సీఐ వై.రామకృష్ణ, బాధితులు తెలిపిన వివరాలివీ.. 403 ఫ్లాట్‌లో నివసిస్తున్న శశిభూషణరావు, అతని భార్య వైద్యులు. వారు విజయనగరం జిల్లా నెల్లిమర్ల వద్ద గల మిమ్స్ మెడికల్ కళాశాలలో పనిచేస్తున్నారు. వారు అప్పుడప్పుడు ఫ్లాట్‌కు వచ్చి వెళ్తుంటారు. కాగా.. ఈ నెల 21వ తేదీ ఉదయం 7 గంటలకు అదే అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న సూర్యనారాయణ వారికి ఫోన్ చేసి.. ఫ్లాట్‌లో దొంగతనం జరిగినట్లు సమాచారమిచ్చారు. వారు వెంటనే వచ్చి ఇంట్లోని బీరువాను పరిశీలించగా.. అందులో భద్రపరిచిన 7 తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయని పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదే అపార్ట్‌మెంట్‌లోని 502 ఫ్లాట్‌లో నివసిస్తున్న వెంకటరావు ఇంటి తలుపు గడియలు దొంగలు విరగ్గొట్టి లోపలకు ప్రవేశించారు. ఆ సమయంలో వెంకటరావు కుటుంబ సభ్యులందరూ ఏసీ ఉన్న గదిలో నిద్రిస్తున్నారు. ఇంట్లో విలువైన వస్తువులు దొంగలకు చిక్కలేదు. ఇదంతా అర్ధరాత్రి ఒంటి గంట నుంచి 3 గంటల మధ్యలో జరిగినట్లు అపార్ట్‌మెంట్ సీసీ కెమెరాలో రికార్డ్ అయింది. అదే రోజు రాత్రి ఈ అపార్ట్‌మెంట్‌కు సమీపంలోని రత్నా రెసిడెన్సీ, మరొక అపార్ట్‌మెంట్‌లో ఇదే దొంగల ముఠా చోరీకి యత్నించినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. అయితే ఆ అపార్ట్‌మెంట్ నివాసితుల నుంచి ఎటువంటి ఫిర్యాదు రాలేదని సీఐ తెలిపారు. కారుషెడ్ కూడలికి సమీపంలోని అపార్ట్‌మెంట్‌లో చోరీకి పాల్పడింది చెడ్డీ గ్యాంగా? మరే ముఠా అయి ఉంటుంది? అని పోలీసులు ఆరా తీస్తున్నారు. చోరీకి వచ్చిన వారు సుమారు ఆరుగురు ఆపై ఉండొచ్చని భావిస్తున్నారు. శారీరకంగా దృఢంగా ఉన్న వారంతా బనియన్, ఫుల్ ప్యాంట్లు ధరించి ఉన్నారు. అదే చెడ్డీ గ్యాంగ్ అయితే ఇలాంటి దుస్తులు ధరించరని పోలీసులు చెబుతున్నారు. కాగా.. చోరీకి పాల్పడిన వారిని కచ్చితంగా పట్టుకుంటామని సీఐ తెలిపారు. స్టేషన్ పరిధిలో అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు.

గోశాలలో ఏరువాక పున్నమి పూజలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన శ్రీకృష్ణాపురంలోని గోశాలలో శనివారం ఏరువాక పున్నమి పూజలు నిర్వహించారు. గోశాలలోని భూముల్లో వ్యవసాయ పనులను శాస్త్రోక్తంగా ప్రారంభించారు. ముందుగా దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి నాగలి ఎడ్లకి పూజలు చేశారు. అనంతరం భూమి పూజ నిర్వహించి దున్నే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ ఏరువాక పున్నమిగా జ్యేష్ఠ పౌర్ణమిని అభివర్ణిస్తారని తెలిపారు. ఏరువాక పున్నమి రోజు వ్యవసాయ పనులు ప్రారంభించడానికి రైతులంతా తమ పొలాల్లో భూమి పూజ చేస్తారన్నారు. దేవస్థానం ఈఈ రాంబాబు, డీఈ హరి, సూపరింటెండెంట్ వై.అప్పారావు, వేద పండితులు పాల్గొన్నారు.

నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ప్రారంభం


చీరలను ప్రదర్శిస్తున్న మోడల్

అల్లిపురం: ఆషాఢ మాసం ప్రారంభంతో పాటు మరో నెల రోజుల్లో పెళ్లిళ్ల సందడి ప్రారంభం కానున్న నేపథ్యంలో నగరంలో సిల్క్ ఎక్స్‌పో-ఎగ్జిబిషన్ కమ్ సేల్‌ను ఏర్పాటు చేశారు. హోటల్ గ్రీన్‌పార్కులో ఈ సిల్క్ ఎక్స్‌పోను శనివారం ప్రారంభించారు. ఈ ఎగ్జిబిషన్ ఈ నెల 26వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రోజూ ఉదయం 11 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఎక్స్‌పో ఉంటుందని, ప్రవేశం ఉచితమని తెలియజేశారు. ఎగ్జిబిషన్‌లో 50 శాతం వరకు తగ్గింపుతో వేలాది రకాల సిల్క్, కాటన్ డిజైన్ వస్త్రాలు, డిజైనర్ బ్లౌజ్‌లు, కుర్తీలు ఒకేచోట అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. మహారాష్ట్ర పైథాని సిల్క్ చీరలు, కర్ణాటక బెంగళూరు సిల్క్, సాఫ్ట్ సిల్క్, కాషిదా సిల్క్, చందేరి, మహేశ్వరి సిల్క్, పశ్చిమబెంగాల్‌కు చెందిన బలూచారి, జమ్దానీ, లెనిన్ శారీ కాంతా వర్క్ చీరలు ప్రదర్శనలో ఉంచినట్లు తెలిపారు. ఈ ప్రదర్శనలో చీరలతో పాటు దుప్పట్లు, సల్వార్ మెటీరియల్, వివిధ డిజైన్ వస్త్రాలు, లక్నో చికెన్ వర్క్, బాంధినీ, హ్యాండ్ బ్లాక్ ప్రింట్లు కూడా ప్రత్యేక ఆకర్షణగా ప్రదర్శనలో ఉంచినట్లు తెలియజేశారు.

అక్షయపాత్రకు ఎండీఎం వ్యాన్ అందజేత

రూ.12లక్షలతో విద్యుత్ వాహనం అందించిన బీడీఎల్

అగనంపూడి: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా భోజనాన్ని సరఫరా చేసేందుకు వీలుగా జగ్గరాజుపేట సమీపంలోని భారత్ డైనమిక్స్ లిమిటెడ్ సంస్థ అక్షయపాత్ర ఫౌండేషన్‌కు వ్యాన్‌ను ఉచితంగా అందించింది. నగర పరిధిలోని పాఠశాలలకు అక్షయపాత్ర ఫౌండేషన్ మధ్యాహ్న భోజనం సరఫరా చేస్తోంది. వీటిని పాఠశాలలకు తీసుకువెళ్లేందుకు వీలుగా వ్యాన్‌ను బీడీఎల్ సంస్థ రూ.12 లక్షలతో సమకూర్చింది. ఈ మేరకు సంస్థ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో వ్యాన్‌ను ఫౌండేషన్ ప్రతినిధులు అంబరీష దాసకు బీడీఎల్ సంస్థ జనరల్ మేనేజర్ ఆర్.సింహాచలం అందించారు. ఈ సందర్భంగా సింహాచలం మాట్లాడుతూ అక్షయపాత్ర ఫౌండేషన్ సేవా దృక్పథంతో విద్యార్థులకు భోజనం అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలనే సంకల్పంతో వంటకాలు చల్లారకుండా ఉండేవిధంగా వాహనాన్ని ఇన్సులేటెడ్ వాహనంగా రూపుదిద్దామన్నారు. విద్యుత్‌తో నడిచే ఈ వాహనం వల్ల కాలుష్యం సమస్య తలెత్తదన్నారు. కార్యక్రమంలో బీడీఎల్ సంస్థ ఏజీఎం శ్రీధర్ సింగ్, డీజీఎం విక్రమ్, అక్షయపాత్ర మేనేజర్ ప్రవీణ్‌కుమార్, రీజనల్ ఆపరేషన్ మేనేజర్ వి.రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సమానత్వం కోసం మహిళలు ఉద్యమించాలి


మాట్లాడుతున్న జర్నలిస్టు, యూట్యూబర్ వనజ

సీతంపేట: పురుషులతో పాటు మహిళలు సమానత్వం కోసం దీర్ఘకాలిక ఉద్యమం చేయాలని స్వతంత్ర జర్నలిస్టు, ప్రముఖ యూ ట్యూబర్ సి.వనజ పిలుపునిచ్చారు. ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ) 50 ఏళ్ల ప్రస్థానాన్ని సమీక్షించుకుని భవిష్యత్ కార్యాచరణపై స్థానిక పౌరగ్రంథాలయంలో శనివారం సదస్సు జరిగింది. మహిళా ఉద్యమ నిర్మాణంలో పీవోడబ్ల్యూ 50 ఏళ్ల ప్రయాణం, వర్తమానంలో మహిళా ఉద్యమ కర్తవ్యాలు అనే అంశంపై జరిగిన సదస్సులో ఆమె ప్రారంభ ఉపన్యాసం చేశారు. జీవితంలో అనేక రకాలైన హింసలను మహిళలు భరిస్తున్నారని, ముఖ్యంగా సామాన్య ప్రజలు దీనికి బలవుతున్నారన్నారు. వాడు మగాడు ఏమైనా చేస్తాడు అనే ధోరణి ఇంకా ఉందంటే అర్థం చేసుకోవచ్చని తెలిపారు. మహిళల రక్షణకు ఉన్న చట్టాలను నిర్వీర్యం చేయడానికి బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం భేటీ బచావో ప్రచారం కోసం వేల కోట్లు ఖర్చు పెట్టిందని, మహిళల రక్షణపై మాత్రం చిత్తశుద్ధి లేదన్నారు. పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు గంగాభవాని మాట్లాడుతూ ఆంధ్రాలో మహిళలపై దాడులు, అత్యాచారాలు ఇటీవల ఎక్కువయ్యాయన్నారు. మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.సంధ్య మాట్లాడుతూ 1974 నుంచి పీవోడబ్ల్యూ అనేక అంశాలపై ప్రజా ఉద్యమాలు చేస్తోందన్నారు. పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రతినిధి ఎస్.విష్ణు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి వర్తమాన ఉద్యమ లక్ష్యాలను వివరించారు. సదస్సులో భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామమూర్తి, పలు ప్రజా, మహిళా సంఘాల ప్రతినిధులు అనూరాధ, లలిత, వెంకటేశ్వర్లు, పద్మ, మణి, భారతి పాల్గొన్నారు.

మత్స్య ఉత్పత్తుల మార్కెటింగ్‌పై శిక్షణ


మహిళలకు రెక్సిన్ షీట్‌లను అందజేస్తున్న నెట్ ఫిష్ తూర్పు తీర రాష్ట్రాల కో-ఆర్డినేటర్ హనుమంతరావు

మహారాణిపేట: పరిశుభ్ర వాతావరణంలో మత్స్య ఉత్పత్తులను విక్రయించడం, నాణ్యమైన పద్ధతుల్లో మార్కెటింగ్ చేయడంపై మత్స్యకార మహిళలకు శిక్షణ ఇచ్చారు. ఫిషింగ్ హార్బర్‌లోని ఏపీ మెకనైజ్డ్ ఫిషింగ్ బోటు ఆపరేటర్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఎంపెడా అనుబంధ సంస్థ నెట్‌ఫిష్ ఆధ్వర్యంలో శనివారం ఈ కార్యక్రమం జరిగింది. నెట్‌ఫిష్ తూర్పు తీర రాష్ట్రాల కో-ఆర్డినేటర్ హనుమంతరావు సారథ్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు వాసుపల్లి జానకీరామ్ మాట్లాడుతూ రూ.150 కోట్లతో ఫిషింగ్ హార్బర్‌లో నిర్మిస్తున్న మోడ్రన్ ఫిష్ మార్కెట్‌లో కార్యకలాపాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. నెహ్రూ బజార్, ఎంవీపీ కాలనీ సర్కిల్, ఆర్టీసీ కాంప్లెక్స్ మార్కెట్ తదితర మార్కెట్లకు దీటుగా నాణ్యమైన మత్స్య సంపద ఇక్కడి మోడల్ ఫిష్ మార్కెట్‌లో త్వరలోనే అందుబాటులోకి వస్తుందన్నారు. ఫిషింగ్ హార్బర్‌లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, మార్కెటింగ్ ఇబ్బందులు లేకుండా జాయింట్ డైరెక్టర్ ఫిషరీస్‌తో మాట్లాడి మెరుగైన వసతులు కల్పిస్తామని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మణరావు మహిళలకు తెలిపారు. మహిళలు మార్కెట్ చేసుకునేందుకు ఉపయోగపడే రెక్సిన్ షీట్‌లను కో-ఆర్డినేటర్ హనుమంతరావు మహిళలకు అందజేశారు. అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి పి.ధన, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కంచిపాటి స్మారక పురస్కారాల ప్రదానం

- విజేతలకు నగదు బహుమతుల అందజేత
- ఆకుపచ్చని జ్ఞాపకం పుస్తకావిష్కరణ


పుస్తకావిష్కరణలో పాల్గొన్న నటుడు ప్రసన్నకుమార్, రచయిత వెంకట్ కంచిపాటి తదితరులు

అగనంపూడి: కంచిపాటి గురుమూర్తి స్మారక పురస్కారాల ప్రదానోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. అగనంపూడి సీడబ్ల్యూసీలో నిర్వహించిన కార్యక్రమంలో కథలు, కవితల పోటీల విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న నంది అవార్డు గ్రహీత, సినీ నటుడు ఐ.ప్రసన్న కుమార్ మాట్లాడుతూ యువ రచయితలను ప్రభుత్వ ప్రోత్సహించాలన్నారు. నేటి కంప్యూటర్ యుగంలో కథలు, కవితలు చదివేవారు, వినేవారు, రాసేవారు తక్కువైపోతున్నారని, వాటిని ప్రభుత్వం ప్రోత్సహిస్తే యువత ముందుకు వస్తుందని అన్నారు. తన తండ్రి పేరిట కథలు, కవితల పోటీలు నిర్వహించి, పురస్కారాలు అందజేసిన వెంకట్ కంచిపాటిని ఆయన ప్రశంసించారు. యువ రచయిత, కార్యక్రమ నిర్వాహకుడు వెంకట్ కంచిపాటి మాట్లాడుతూ తన తండ్రి అభిరుచి మేరకు తాను రచయితగా మారానన్నారు. ఆయనకు కథలు, కవితలంటే ఇష్టమని, ఆయన పేరుతో నిర్వహించిన పోటీలకు మంచి స్పందన రావడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా వెంకట్ కంచిపాటి రచించిన ఆకుపచ్చని జ్ఞాపకం పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించారు. ముందుగా కథలు, కవితల పోటీల్లో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు ప్రత్యేక ప్రశంసా బహుమతులుగా నగదు అందించారు. కార్యక్రమంలో కథా రచయిత, నటుడు చెల్లూరి సాంబమూర్తి, రచయిత దేవులపల్లి దుర్గా ప్రసాద్, తెలుగు పండితుడు కొప్పిశెట్టి సూర్యనారాయణ మాస్టారు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు బలిరెడ్డి సత్యనారాయణ, పులగపూరి ఆశాలత, రిటైర్డ్ హెచ్‌ఎం బొండా అప్పారావు, రచయిత సీపాన రమేష్‌బాబు, ఐఆర్‌సీహెచ్.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పుచ్చకాయల వ్యాపారిపై దాడి

అక్కిరెడ్డిపాలెం: గాజువాక శ్రీనగర్ సంతలో పుచ్చకాయల వ్యాపారిపై మద్యం మత్తులో ఇద్దరు వ్యక్తులు దాడి చేశారు. ఈ ఘటనలో వ్యాపారి తీవ్ర గాయాలపాలైనట్లు గాజువాక పోలీసులు తెలిపారు. వివరాలివీ.. ధనుంజయ్ అనే వ్యాపారి శనివారం సంతలో పుచ్చకాయల వ్యాపారం చేసుకుంటున్నాడు. కాగా.. మద్యం మత్తులో ఉన్న కార్తీక్, పెప్సీ అనే వ్యక్తులు వ్యాపారితో గొడవ పడ్డారు. తాగి వచ్చి గొడవ చేయవద్దని వారించిన వ్యాపారిని వీరు బలవంతంగా తోసేశారు. దీంతో కింద పడిన ఆయన తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆ సమయంలో జనం ప్రేక్షకుల్లా చూస్తున్నారే గానీ.. ఎవరూ గొడవను అదుపు చేసే ప్రయత్నం చేయలేదు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని దాడికి పాల్పడిన ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. గాయపడిన వ్యాపారిని తోటి వ్యాపారులు గాజువాకలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. వ్యాపారి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.